క్లుప్తంగా

పదవుల్లో కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మెట్‌పల్లి: కాంగ్రెస్ పటిష్టత కోసం కష్టపడ్డ కార్యకర్తలకు నామినేటేడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు నాయకులు కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు నివాసంలో సమావేశమై, మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినవారికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన కొందరు పదవులు ఆశిస్తున్నారని, వారిని పరిగణలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నాయకులు రేండ్ల రమేశ్, ఖాజా అజీమ్, కట్కం గంగారెడ్డి, పొట్ట రాజేశ్వర్, బత్తుల దీక్షిత్, గోనె ప్రసాద్, సంగు గంగాధర్ తదితరులున్నారు.

అభివృద్ధిలో పోటీ పడండి

జగిత్యాలటౌన్: ఫొటోలు, వినతిపత్రాలతో సరిపెట్టకుండా అభివృద్ధిలో పోటీపడి యావర్ రోడ్డు విస్తరణ, నూకపెల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ అనుమల్ల కృష్ణహరి కోరారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోటీపడి ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇస్తున్నారని, అవి ఫొటోలకు పరిమితం చేయకుండా ప్రజలకు మేలు చేయాలని సూచించారు.

'ఉచిత విద్యుత్ బిల్లులు రానివారు సరిచేసుకోండి'

సారంగాపూర్: ఉచిత విద్యుత్ బిల్లులు రానివారు ఎడిట్ ఆప్షన్‌లో తమ వివరాలు సరిచేసుకోవాలని సారంగాపూర్, బీర్‌పూర్ ట్రాన్స్‌కో ఏఈలు సతీశ్, శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుదారుల ఇంటి మీటరు నంబర్ ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిందని, లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయాల్లో సవరించుకోవాలని సూచించారు.

మట్టి దారికి మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న డీఎస్పీ, సీఐ

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామపూర్-ఫకీర్‌కొండాపూర్‌ల మధ్య వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పక్కనే మట్టి దారిని నిర్మించారు. అది ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుడి ఉదారత



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న మల్లేశం

మల్యాల: ముత్యంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మల్యాల మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నల్లపు మల్లేశం గురువారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆదిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజు, కిశోర్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ శోభ, నాయకులు ప్రతాప్, జీవన్, పుష్పనాథం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. గురువారం మల్లాపూర్ మండలం నుంచి మెట్‌పల్లి పట్టణానికి ఇసుక తీసుకెళ్తుండగా వేంపేట వద్ద పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ కనెక్షన్ తొలగింపు.. పునరుద్ధరణ

మల్యాల: మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారుల తీరు విమర్శలకు దారితీసింది. సూరప్ప చెరువు శిఖం పట్టా భూమిలో ఓ రైతు దశాబ్దకాలంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ద్వారా సాగు చేస్తున్నాడు. అధికారులు కనీసం అతన్ని సంప్రదించకుండా కనెక్షన్ తొలగించారు. గురువారం బాధిత రైతు తోటి రైతులతో కలిసి విద్యుత్‌శాఖ అధికారుల వద్దకు వెళ్లాడు. ఏటా చెల్లిస్తున్న వ్యవసాయ విద్యుత్ బిల్లు రశీదులు చూపించడంతో వారు తమ తప్పు తెలుసుకొని, విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఈ దయానంద్‌ను వివరణ కోరగా, తన దృష్టికి తీసుకురాకుండానే విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

రాయికల్: పట్టణంలోని ఇటిక్యాల కళాశాల వద్ద లోలెవల్ వంతెన సమీపంలో గురువారం సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ప్రమాదాల నివారణకే ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



జగిత్యాలలో బోనమెత్తుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



కోరుట్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు

పోచమ్మ బోనాలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని 15, 16వ వార్డుల్లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు తీశారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అమ్మవారికి పూజలు చేశారు. పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, కౌన్సిలర్లు, నాయకులున్నారు.

కోరుట్ల: పట్టణంలోని రాంనగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ తల్లి ఆలయానికి వెళ్లి, మొక్కు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ మాదవేణి నరేశ్, సంఘం అధ్యక్షుడు మాదవేణి సురేశ్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి నర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఏలో ఉత్తీర్ణత



అర్చన

రాయికల్: మండలంలోని రామాజీపేటకు చెందిన అంబళ్ల అర్చన చార్టెడ్ అకౌంట్స్(సీఏ)లో ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. రాజిరెడ్డి-సులోచన దంపతుల కూతురు అర్చన రాయికల్‌లోని కేరళ విద్యాలయంలో పదోతరగతి, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, నిజాం కళాశాలలో డిగ్రీ చదివింది. 2016లో ఉస్మానియా పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంక్ సాధించి, క్యాంపస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర

జగిత్యాలటౌన్: ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర గురువారం వైభవంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని టౌన్‌హాల్లో జరిపిన ప్రత్యేక పూజలకు బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి దంపతులు హాజరయ్యారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. కొత్త బస్టాండ్, ఎల్జీరాం లాడ్జి, క్లాక్ టవర్, మోచీబజార్, జంబిగద్దె మీదుగా తిరిగి టౌన్‌హాల్‌కు చేరుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత రథం ముందు రోడ్డును ఊడ్చారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం హరినామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు. ఇస్కాన్ మెట్‌పల్లి ప్రెసిడెంట్ నరహరి ప్రభూజీ, జగిత్యాల ప్రచార కేంద్రం కో–ఆర్డినేటర్ దాసరి కృష్ణ, మెట్‌పల్లి కో–ఆర్డినేటర్ సురనాథ్ శ్రీనివాస్‌దాస్, ఇస్కాన్ ప్రతినిధులు ప్రేమానంద గోవింద్‌దాస్, రఘునాథ్ రాజేంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.



రథం ముందు రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో శ్రీజగన్నాథ స్వామి రథోయాత్ర గురువారం వైభవంగా జరిగింది. స్థానికులతోపాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవమూర్తులకు కొండపై ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలతో రథయాత్ర నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఎస్సై దత్తాద్రి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రేచపల్లి రథయాత్రలో భక్తులు

కేంద్ర మంత్రి సంజయ్ జన్మదిన వేడుకలు

కోరుట్ల: పట్టణంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కాలేజ్ గ్రౌండ్ దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కౌన్సిలర్ పెండెం గణేశ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్, సీనియర్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్ గౌడ్, గిన్నెల అశోక్, సంజీవ్, చెట్లపెల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం సిరికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేపీ నాయకులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అంతకుముందు కథలాపూర్‌లో కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు. బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, మామిడిపెల్లి ప్రవీణ్, ఆల్గోట్ ప్రమోద్, జక్కని శ్రీహరి పాల్గొన్నారు.

మేడిపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను గురువారం ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. దేశాయిపేటలో ఆయన అభిమాని అన్నాడి జలపతిరెడ్డి నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కట్లకుంటలో ఎస్ఎస్.రెడ్డి అనే అభిమాని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.



కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. భోగ రాకేశ్, నాంపల్లి రాజేశం, భూమేశ్, చిరంజీవి, అశోక్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ డబ్బు రాధ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. గురువారం స్థానిక ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తోందన్నారు. ఇళ్లులేని వారికి త్వరలోనే నిర్మిస్తామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బోనాల పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల మేదిని లలిత కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న బోనాలకు సంబంధించిన పోస్టర్ చైర్‌పర్సన్ జ్యోతి ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



రాయికల్: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన 6, 7వ వార్డులను మున్సిపల్ కమిషనర్ చిరంజీవి గురువారం పరిశీలించారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. పలు వార్డుల్లో డ్రైడే సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ నిల్వ నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

గీత కార్మికుల హక్కుల సాధనకు కృషి

జగిత్యాల: గీత కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తానని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్శరాంగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గత పాలకవర్గాన్ని రద్దు చేసి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్‌గా నర్సాగౌడ్‌ను నియమించారు. కార్మికులు ఐక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు తమ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశంగౌడ్, మల్లేశం గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



కొత్త పాలకవర్గాన్ని అభినందిస్తున్న పర్శరాంగౌడ్

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోరుట్ల: కోరుట్లలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని ఖండిస్తూ కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్, కోశాధికారి చిలివేరి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు తోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడే ఇందిరమ్మ రాజ్యమా?

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ఇందిరమ్మ రాజ్యం అంటే జర్నలిస్టులపై దాడి చేయడమా అని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం సాయంత్రం ఆమె జగిత్యాలలో ఆమె మాట్లాడారు. జర్నలిస్టులంటే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంలాంటి వారని, వారిపై ఉక్కుపాదం మోపడం సరికాదని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, విధి నిర్వహణలో ఉన్నవారిపై దాడులు చేయడం దురదృష్టకరమన్నారు.

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో న్యూస్ కవరేజ్ చేస్తున్న జర్నలిస్టుపై పోలీసులు దాడి చేయడంపై మెట్‌పల్లి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం స్థానిక జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కమలాకర్, విజయ్, నవీన్, షౌకత్ అలీ, సంతోష్ తదితరులున్నారు.

కోరుట్ల: హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసన కవరేజీకి వెళ్లిన రిపోర్టర్ శ్రీచరణ్‌పై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుట్ల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, కార్యదర్శి మల్లికార్జున్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేసేవరకూ పోరాడుతాం'

కోరుట్ల: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేసేవరకూ పోరాడుతామని సీపీఐ నాయకులు తెలిపారు. కోరుట్ల పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, సహాయ కార్యాదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, అర్హులకు పింఛన్లు వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాలని తీర్మానించారు. 25, 26వ తేదీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీపీఐ నేతలు శిక్షణ శిబిరాలకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎ.రాధ, నాయకులు రామిల్ల రాంబాబు, దాసరి మనోహర్, సాందార్ మహేశ్, మ్యాదరి గణేశ్, ఎండీ.సమీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన సీపీఐ నాయకులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

జగిత్యాల: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. గురువారం జగిత్యాలలోని ఆనంద నిలయంలో పరిసరాలను పరిశీలించారు. గుంతలు, ఖాళీ స్థలాలు, కుండల్లో నీరు నిల్వ ఉండకూడదన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటలో గురువారం సీజనల్ వ్యాధులపై కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మెట్‌పల్లిరూరల్: వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మెట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్‌లో గురువారం ఆయన పర్యటించారు. డ్రైనేజీ నిర్వహణ, చెత్త సేకరణ, బ్లీచింగ్ చల్లడం, పిచ్చి మొక్కల తొలగింపు, ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను పరిశీలించారు. పారిశుధ్య చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి నిజామొద్దీన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆనంద నిలయంలో పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో గల్ఫ్ బాధిత కుటుంబానికి గురువారం గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక(జీడబ్ల్యూఏసీ) ఆధ్వర్యంలో రూ.25 వేలు, వీవీరావుపేట గల్ఫ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.8 వేల ఆర్థికసాయం అందించారు. వేంపల్లికి చెందిన కండెల వెంకటి గల్ఫ్ వెళ్లి, అప్పులు తీరకపోవడంతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. వేదిక దమామ్ ఇన్‌చార్జి బాలసాని లక్ష్మీనారాయణగౌడ్, సదాశివ, మోహన్, సంద స్వామి, కృష్ణ, సాయికుమార్, రవి, రాజన్న, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటకు చెందిన ఎన్ఆర్ఐ ఖైర దేవ్‌యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా గురువారం రూ.25 వేలు పంపించగా, ఆయన మిత్రులు గల్ఫ్ బాధిత కుటుంబానికి అందించారు. భీమారం మండలంలోని మోత్కురావుపేటకు చెందిన భూమల్ల గణేశ్ దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి, మృతిచెందాడని తెలిపారు. బాధిత కుటుంబానికి దేవ్‌యాదవ్ సాయం చేశారని పేర్కొన్నారు.

సత్సంగ్ సభ్యుడి కుటుంబానికి..

జగిత్యాల: పట్టణానికి చెందిన సత్సంగ్ సభ్యుడు భద్రి శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి జగిత్యాల పట్టణ భక్త మార్కండేయ సత్సంగ్ సభ్యులు గురువారం రూ.43,755 ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

జగిత్యాలటౌన్: విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పరిశ్రమల శాఖతో అనుసంధానించాలని విశ్వకర్మ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శివపల్లి రాజేశం డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ సమావేశం గురువారం జగిత్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. అటవీ శాఖ నుంచి విశ్వకర్మలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. విశ్వకర్మ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశం, పరిషత్ ప్రతినిధులు

✦ **మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పరామర్శ**

ధర్మపురి: మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత గురువారం పరామర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, అడ్వకేట్ శ్రీరాములు, మున్నూరు కాపు నాయకులురులున్నారు.

✦ **క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి**

మల్లాపూర్: క్షయవ్యాధి నివాణకు ప్రజలందరూ కృషి చేయాలని టీబీ సూపర్‌వైజర్ ఆంజనేయులు అన్నారు. గురువారం వేంపల్లిలో నిర్వహించిన క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరానికి మండల వైద్యాధికారి డాక్టర్ వాహినితో కలిసి హాజరయ్యారు. వ్యాధి లక్షణాలున్న 22 మంది నుంచి తెమడను సేకరించి, కోరుట్ల పరీక్ష కేంద్రానికి పంపించినట్లు తెలిపారు.

✦ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మల్లాపూర్: 33 కేవీ విద్యుత్ లైన్ల ప్రత్యేక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మొగిలిపేట, రాఘవపేట సబ్‌స్టేషన్ల పరిధిలో, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు మల్లాపూర్, వీవీరావుపేట, దాంరాజుపల్లి, రాఘవపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

✦ **దినసరి కూలీ పెంచాలి**

జగిత్యాలరూరల్: జిల్లాలోని ఫంక్షన్‌హాళ్లలో పని చేస్తున్న తమకు దినసరి కూలీ పెంచాలని కూలీలు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. రోజుకు రూ.500 ఇస్తున్నారని, ధరలు పెరగడంతో సరిపోవడం లేదన్నారు.

✦ **రైతులకు అవగాహన సదస్సు**

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం తక్కళ్లపల్లిలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వానపాములతో ఎరువు తయారీ విధానం, వివిధ పంటల్లో వేసుకునే ఎరువుల మోతాదు, ట్రైకోడెర్మా విరిడి శిలీంధ్రనాశినిని అభివృద్ధి చేసుకునే విధానం వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ భారతీనారాయణ భట్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

✦ **మొక్కలు నాటి, సంరక్షించాలి**

పెగడపల్లి: మొక్కలు నాటి, సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ కోరారు. గురువారం పెగడపల్లి, కీచులాటపల్లి గ్రామాల్లో ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు.

✦ **ఈత వనాలతో గీత కార్మికులకు ఉపాధి**

రాయికల్: ఈత వనాల పెంపకంతో గీత కార్మికులకు ఉపాధి మెరుగుపడుతుందని ఆబ్కారీ శాఖ జగిత్యాల సీఐ సర్వేశ్వర్ అన్నారు. గురువారం ఇటిక్యాల గౌడ కులస్తులతో కలిసి చింతల చెరువు కట్టమీద ఈత మొక్కలు నాటారు. ఎస్సై స్వప్న, గౌడ సంఘం అధ్యక్షుడు నరసాగౌడ్ తదితరులున్నారు.

✦ **గుడుంబా పట్టివేత**

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఏఎస్ఆర్, ఆత్మనగర్ తండాల్లో ఎక్సైజ్, పోలీస్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. 10 లీటర్ల గుడుంబాతోపాటు 500 లీటర్ల ముడిసరుకును పట్టుకున్నారు. ఏఎస్ఆర్ తండాకు చెందిన జరుపుల గంగాధర్, ఆత్మనగర్ తండాకు చెందిన జరుపుల సంతోష్‌లపై కేసు నమోదు చేశామని మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్ తెలిపారు.

✦ **మాజీ వైస్ ఎంపీపీకి సన్మానం**

మల్లాపూర్: పదవీ విరమణ పొందిన మాజీ ఎంపీపీ గౌరు నాగేశ్‌ను ముత్యంపేటలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు గురువారం సన్మానించారు. అభివృద్ధి పనులు చేపట్టి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందేలా చూశారని కొనియాడారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చింతల రమేశ్, నాయకులున్నారు.

✦ **సీఎం దిష్టిబొమ్మ దహనం**

రాయికల్: డీఎస్సీ అభ్యర్థులు, జర్నలిస్టులపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాయికల్ శివాజీ విగ్రహం వద్ద గురువారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కౌన్సిలర్లు కాంతారావు, శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మహేందర్ తదితరులున్నారు.

✦ **మారెమ్మ తల్లికి పూజలు**

మల్లాపూర్: మండల కేంద్రంలోని మారెమ్మ తల్లికి గురువారం పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఎల్లాల జలపతిరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, కాంగ్రెస్ మండల శాఖ మాజీ అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి నాయకులున్నారు.

ప్రజాసేవతోనే పదవులకు గుర్తింపు



ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లను సన్మానించిన కృష్ణారావు, జలపతిరెడ్డి

మల్లాపూర్: ప్రజాసేవతోనే పదవులకు గుర్తింపు దక్కుతుందని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్లి సత్తెమ్మ, మామిడి మంజుల, మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్‌లను సన్మానించారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, నాయకులున్నారు.